## క్లుప్తంగా

### 'ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బిచ్కుంద: జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతా రావుకు మంత్రి పదవి ఇవ్వాలని పీసీసీ డెలిగెట్ విఠల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగాధర్, నాయకుడు తుకారాం అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధికి దూరంలో ఉన్న నియోజకవర్గానికి మంత్రి పదవి దక్కితే అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు సాహిల్ షెట్కార్, సీమ గంగారాం, తుకారాం, రవి పటేల్, అశోక్, ఖలీల్, నయీమ్, నౌషా నాయక్ పాల్గొన్నారు.

### పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

బాన్సువాడ: ఉపాధ్యాయులు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని భరోసా బృందం, షీటీం సభ్యులు అన్నారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భరోసా బృందం, షీటీం సభ్యులు తదితరులు ఉన్నారు.

### జూన్ 15లోగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి



సదాశివనగర్: పట్టాపాస్ పుస్తకం కలిగి ఉన్న ప్రతి రైతు వచ్చే నెల 15లోగా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రజాపతి సూచించారు. గురువారం మండల కేంద్రంతో పాటు పద్మాజివాడి, అడ్లూర్ ఎల్లారెడ్డిలలో నిర్వహిస్తున్న రైతు వివరాల నమోదును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈవోలు శ్రీనివాస్ నాయక్, కవిత, శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

### ఉపాధి హామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

లింగంపేట: మండలంలోని ఎల్లమ్మ తండా శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో నరేశ్ గురువారం పరిశీలించారు. చేపల చెరువు పనులు కొలతల ప్రకారం చేపట్టాలని ఆదేశించారు. కూలీలు ఎక్కువ మంది పనుల్లో పాల్గొనేలా చూడాలని క్షేత్రసహాయకులకు సూచించారు. అనంతరం నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఆయన వెంట క్షేత్రసహాయకుడు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

### దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువ వికాస్ దరఖాస్తులను మండల అధికారులు గురువారం పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి కిషన్ మట్లాడుతూ.. రాజీవ్ యువ వికాస్ దర ఖాస్తులను కెనరా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్లతో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, బ్యాంక్ మేనేజర్ల్, సిబ్బంది పాల్గొన్నారు.

### రాజంపేట తహసీల్దార్‌గా జానకి



రాజంపేట: మండల తహసీల్దార్‌గా జానకి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు పనిచేసిన సతీశ్‌రెడ్డి వేరే చోటుకు బదిలీ కాగా లక్ష్మణచందా నుంచి వచ్చిన కె జానకి రాజంపేటకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ సంతోష, ఆర్‌ఐ లక్ష్మణ్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

# మురుగు ముందుకు పారేదెలా..

- మురికి కాలువలను వదలని ఆక్రమణదారులు
- డ్రైనేజీల ఆనవాళ్లు కనబడకుండా కబ్జాలు
- పట్టించుకోని బల్దియా అధికారులు



నాజ్‌టాకీస్ రోడ్‌లో రోడ్డుపై నిలిచిన మురుగు



రామారెడ్డి రోడ్‌లో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు(ఫైల్)

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. రోడ్లకు ఇరువైపులా ఉన్న మురికి కాలువలను ఆక్రమణదారులు కబ్జా చేస్తుండడంతో మురుగునీటి కాలువలు వ్యర్థాలతో నిండి ముందుకు పారడం లేదు. దీంతో చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయమవుతున్నాయి. స్పందించాల్సిన బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలో మొక్కుబడిగా చర్యలు చేపడుతున్నారని పురప్రజలు మండిపడుతున్నారు.

**స్లాబ్‌లు వేసుకొని..**

పట్టణంలోని ప్రధానమైన రోడ్లకు ఇరువైపులా నిర్మించిన డ్రెయినేజీలను వ్యాపార దుకాణదారులు, కొందరు ఇంటి యజమానులు యథేచ్ఛగా ఆక్రమించుకున్నారు. మరికొందరు డ్రెయినేజీ ఆనవాళ్లు కనిపించకుండా స్లాబ్‌లు వేసుకుని రోడ్లుపైకి కబ్జాకు వచ్చేశారు. డ్రెయినేజీ దాటి శాశ్వత నిర్మాణాలు చేపట్టినా అడిగేవారే లేకుండా పోయారు. జేపీఎన్‌రోడ్, మాయాబజార్, సుభాష్‌రోడ్, స్టేషన్ రోడ్, సిరిసిల్లారోడ్, పెద్దబజార్, రామారెడ్డిరోడ్, విద్యానగర్‌కాలనీ, అశోక్‌నగర్‌కాలనీ, ఎన్జీవోస్‌కాలనీ, దేవునిపల్లిరోడ్, జన్మభూమిరోడ్, నాజ్‌టాకీస్ రోడ్, వివేకానందకాలనీ, ప్రియాడిలక్స్‌రోడ్ లలో రోడ్లకు ఇరువైపులా డ్రెయినేజీలు ఆక్రమణలకు గురయ్యాయి. మురికి కాలువలు కనబడకుండా ఉన్నాయి. మరి కొందరు డ్రెయినేజీని మూసేసి వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు.

పారిశుధ్య కార్మికులకు మురుగుకాలువలు శుభ్రం చేసేందుకు వీలు లేకుండా మారింది. వ్యాపారులు వ్యర్థాలను మురికి కాలువలో వేయడంతో పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీటి ప్రవాహం నిలిచిపోయి రోడ్డుపైనే పారుతోంది. నిజాంసాగర్ చౌరస్తా, రామారెడ్డిరోడ్, పోలీస్‌స్టేషన్ ముందు, రైల్వేస్టేషన్, సిరిసిల్లారోడ్‌లో మాత్రం భారీ వర్షాలకు రోడ్లన్నీ చెరువుల్లా తలపిస్తుంటాయి.

### ఆక్రమణలను తొలగించాలి



పట్టణంలో ప్రధాన రోడ్లకు ఇరువైపులా మురికి కాలువలపై నిర్మించిన ఆక్రమణలను నిర్వాహకులు స్వచ్ఛందంగా తొలగించాలి. లేకుంటే చర్యలు తీసుకుంటాం. వర్షాకాలం ముందస్తు చర్యలు చేపడుతాం. టౌన్‌ప్లానింగ్ విభాగంతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి



పొట్టిశ్రీరాములు విగ్రహం వెనకాల మురికి కాలువపై స్లాబ్ వేసిన వ్యాపారులు



మున్సిపల్ కార్యాలయం పక్కన నిర్మించిన ఆక్రమణలు



జేపీఎన్ రోడ్ గంజ్ గేట్ వద్ద మురికి కాలువపై స్లాబ్ వేసిన వ్యాపారులు

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



హన్మాజీపేట్‌లో ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసిన సభ్యులు



కుర్తిలో..



పాతరాజంపేటలో మంజూరు పత్రం అందజేస్తున్న సభ్యులు

బాన్సువాడ రూరల్/ పిట్లం/ కామారెడ్డిరూరల్: బాన్సువాడ మండలంలోని చిన్న హన్మాజీపేట్‌లో గురువారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ముగ్గుపోసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని జీపీ కార్యదర్శి రాజేశ్ సూచించారు. కారొబార్ దత్తు, గ్రామస్తులు పాల్గొన్నారు. పిట్లం మండలంలోని కుర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండల పంచాయతీ అధికారి నాగరాజు భూమి పూజ చేశారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి విజయ, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాతరాజంపేటలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోశారు. లబ్ధిదారులు ఇళ్ల మంజూరు ప్రతాలను ఇందిరమ్మ కమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు బత్తుల చందన రవి, వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, రాజయ్య, లింగం, భూదేవి, లత, మణెమ్మ, సత్తవ్వ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### సర్వీస్ రోడ్లు మరమ్మతులకు నోచుకునేనా..



సదాశివనగర్: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వీస్ రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న సర్వీస్ రోడ్లపై భారీ గుంతలు ఏర్పడడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. సర్వీస్ రోడ్లను బీటీ రోడ్డుగా మార్చాలని కొన్నేళ్లుగా అధికారులకు విన్నవిస్తున్నా స్పందన కరువైంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

### మద్నూర్‌లో నిలిచిన ఆధార్ సేవలు

మద్నూర్: మండల కేంద్రంలోని పోస్టాఫీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం సేవలు రెండు రోజులుగా నిలిచిపోయాయి. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కేంద్రానికి సర్వర్ ప్రాబ్లం ఉండడంతో సేవలు నిలిచిపోయినట్లు ఆపరేటర్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. మద్నూర్‌లో నిలిచిపోయిన ఆధార్ సేవలతో గ్రామీణ ప్రజలు కేంద్రాలకు వచ్చి తిరిగివెళ్తున్నారు. అధికారులు స్పందించి ఆధార్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## యోగాను అలవాటు చేసుకోవాలి



ఎల్లారెడ్డిలో విశ్రాంత ఉద్యోగులతో మాట్లాడుతున్న యోగా గురువు సుజాత



చిల్లర్గిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రత్నం

ఎల్లారెడ్డిరూరల్/ లింగంపేట/ పిట్లం: ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలని యోగా గురువు సుజాత అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో యోగా గురించి అవగాహన కల్పించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా ప్రతి రోజు ఒక్కో చోట యోగా గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. లింగంపేట మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో వయోవృద్ధులు, పిల్లలకు యోగాపై వైద్య నిపుణురాలు నసీంసుల్తానా అవగాహన కల్పించారు. యోగాతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్టు శ్వేత, యోగా ఇన్‌స్ట్రక్టర్ నర్సింలు, సరిత, ఎంఎన్‌వో రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన చక్కని మార్గమని ఆయుర్వేదిక్ డాక్టర్ రత్నం అన్నారు. పిట్లం మండలంలోని చిల్లర్గి గ్రామం ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో యోగా మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. యోగా వల్ల కలిగే లాభాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు కార్తిక్, సౌజన్య, వసంతరావు, హరీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం



మద్నూర్: మానసిక, శారీరక ధృడత్వానికి క్రీడలు దోహదపడతాయని మద్నూర్ ఎస్సై విజయ్‌కొండ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర్ హడత్ వ్యాపారుల ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్సై ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### రేపు ఆలయ భూముల కౌలు వేలం

భిక్కనూరు: తిప్పాపూర్‌లోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ భూముల కౌలు వేలంను ఈనెల 31న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మల్లుపేట భూమయ్య గురువారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించే వేలంలో రైతులు పాల్గొనాలని కోరారు.

### వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

తాడ్వాయి: మండలంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్, వాహన ధ్రువీకరణ పత్రాలు వారికి జరిమానా విధించారు. తనిఖీలో కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

### ర్యాలీని విజయవంతం చేయాలి

మాచారెడ్డి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్న మంద కృష్ణ మాదిగకు నిర్వహించనున్న స్వాగత ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు బట్ట రమేశ్ కోరారు. ఈ మేరకు గురువారం మాచారెడ్డి లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 31న వరంగల్‌లో నిర్వహించనున్న స్వాగత ర్యాలీకి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు రవి, రాజెల్లం, నాల్లపురం సురేశ్, నర్సింలు, రమేశ్ ఉన్నారు.

### సభను విజయవంతం చేయాలి

రామారెడ్డి: వరంగల్‌లో ఈ నెల 31న నిర్వహించే ఎమ్మార్పీఎస్ జాతీయ సన్నాహక సమావేశానికి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని జిల్లా కార్యదర్శి కొత్త్వాళ్ల యాదగిరి పిలుపునిచ్చారు. ఉప్పల్‌వాయిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సభను సభ్యులు విజయవంతం చేయాలని కోరారు.నాయకులు కాస్తూరి శైలేష్, బానపురం లావణ్య, అనసూయ, లక్ష్మణ్, చింతకుంట సాయిలు, రాజు పాల్గొన్నారు

### వంగిన కరెంట్ స్తంభాలు



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి ఎన్‌హెచ్ 44 పక్కన ట్రాన్స్‌కో అధికారులు మూడు రోజుల క్రితం కొత్త కరంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం వీచిన గాలి వానకు స్తంభాలు వంగి ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి వంగిన కరెంట్ స్తంభాలను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# గ్రామాల్లో జీలుగ విత్తనాల పంపిణీ



మాచారెడ్డిలో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో



దోమకొండలో..

మాచారెడ్డి/ దోమకొండ/ రాజంపేట/ బాన్సువాడ రూరల్/ కామారెడ్డిరూరల్: మాచారెడ్డి సింగిల్ విండోలో గురువారం రైతులకు ఏవో పవన్ జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. మాచారెడ్డి సింగిల్ విండోకు 250 బస్తాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. 30 కిలోల బస్తాకు రూ.2137కు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో ప్రభాకర్, విండో సిబ్బంది ఉన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంతో పాటు ముత్యంపేట గ్రామంలోని సింగిల్‌విండో కార్యాలయంలో రైతులకు జనుము, జీలుగ విత్తనాలను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి మణిదీపిక తెలిపారు. దోమకొండలో 30 క్వింటాళ్ల జనుము, 30 క్వింటాళ్ల జీలుగ, ముత్యంపేటలో 30 క్వింటాళ్ల జీలుగ, 20 క్వింటాళ్ల జనుము 50శాతం సబ్సిడీపై రైతులకు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా సొసైటీ అధ్యక్షులు నాగరాజ్ రెడ్డి, తిరుపతిగౌడ్, సొసైటీ కార్యదర్శులు బాల్‌రెడ్డి, రాంచంద్రం, రైతులు పాల్గొన్నారు. రాజంపేట మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు పచ్చి రొట్ట విత్తనాలు, జీలుగ, జనుము విత్తనాలను సంఘం అధ్యక్షుడు నల్లవెల్లి అశోక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ అపర్ణ, మండల వ్యవసాయ అధికారి శృతి, డైరెక్టర్లు, ఆంద్యాల రమేశ్, శ్రీరామ్ సురేశ్, సాయి బాబా పటేల్, బసవయ్య, బాలయ్య, సీఈవో వెంకటేశ్వర శర్మ, రైతులు పాల్గొన్నారు. బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్‌లో రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేసినట్లు క్లస్టర్ ఏఈవో దత్తేశ్వరి తెలిపారు. సొసైటీ కార్యదర్శి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. కామారెడ్డి మండలంలోని గర్గుల్, చిన్నమల్లారెడ్డి గ్రామాల్లో రైతులకు సబ్సిడీపై జీలుగా, పెద్ద జనుము విత్తనాలను వ్యవసాయాధికారులు పంపిణీ చేశారు. మండలానికి జీలుగ విత్తనాల బస్తాలు 466, పెద్ద జనుము విత్తనాల బస్తాలు 250 వచ్చినట్లు మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తెలిపారు. అడ్లూర్, ఇస్రోజివాడి క్లస్టర్ పరిధిలోని రైతులకు కూడా రేపటి వరకు సరిపడా జీలుగ విత్తనాలు వస్తాయని అన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని కోరారు.



రాజంపేటలో..



దేశాయిపేట్‌లో..

## జూన్ చివరి వరకు రేషన్ పంపిణీ



బిచ్కుందలో డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్

బిచ్కుంద/ ఎల్లారెడ్డి: రేషన్ దుకాణాల్లో జూన్ చివరి వరకు మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు బిచ్కుంద తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. గురువారం తహసీల్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. రేషన్ పంపిణీలో డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌ఐ రవీందర్, డీలర్లు ఉన్నారు. రేషన్ దుకాణాల్లో వినియోగదారులు మూడు నెలలకు సంబంధించి రేషన్ ఒకేసారి తీసుకోవాలని ఎల్లారెడ్డి తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్‌ను దుకాణాలకు సరఫరా చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

## రైతులకు అవగాహన సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నస్రుల్లాబాద్: వానాకాలం పంటపై రైతులకు గురువారం బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి భవాని మాట్లాడుతూ.. రైతుల పంట అవశేషాలు కాల్చకూడదన్నారు. గుర్తింపులేని డీలర్ల నుంచి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయవద్దని సూచించారు. విత్తనాలు, ఎరువులు కొనేటప్పుడు రసీదులు తీసుకోవాలన్నారు. అవసరానికి మించి యూరియా ఉపయోగించ కూడదన్నారు. రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారని ఎలాంటి సందేహాలు ఉన్నా సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో గోపాల్, మాజీ సర్పంచ్ అన్నం సత్యనారాయణ, రైతులు లింగమయ్య, సాయిలు, బాబన్న, రాములు తదితరులు ఉన్నారు.

### బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలి



ఆఫీస్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రామారెడ్డి: మండల కేంద్రంలోని గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి వెళ్లిన వారు ఈఈ అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తే సుమారు 20 గ్రామాల ప్రజలకు, రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, దశరథ్ రెడ్డి, నారాయణరెడ్డి, పడిగెల శ్రీనివాస్, రాజా గౌడ్, గంగారాం, రాజనర్సు, ప్రభాకర్ పంతులు, పోతునూరి ప్రసాద్ పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



దోమల నివారణ మందు పిచికారి చేస్తున్న సిబ్బంది

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంప్ తండాలో విషజ్వరాలు ప్రబలిన నేపథ్యంలో గురువారం వైద్య శాఖ సిబ్బంది వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. వర్షాల నేపథ్యంలో మురుగునీరు నిలువ ఉండకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనారోగ్యానికి గురైన వారికి కావాల్సిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఏఎన్‌ఎం యశోద, అనురాధ, జీపీ కార్యదర్శి పరిపూర్ణ, ఆశావర్కర్లు పద్మ, సుచిత్ర, వెంకటలక్ష్మి, కారొబార్ వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.